క్లుప్తంగా

18న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు ఈనెల 18వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై. సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, హిందూ సేవాదళ సభ్యులు, పెద్దలు, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కిస్తామని పేర్కొన్నారు. కావున ఆసక్తి గల వారు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

నేటి నుంచి ఉచిత ఎల్‌ఈడీ టీవీ సర్వీస్ క్యాంప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు పాడైన ఎల్‌ఈడీ టీవీలను మరమ్మతులు చేసేందుకు చుట్టుగుంట బిగ్‌టీవీ సొల్యూషన్స్‌లో ఫ్లడ్ రిలీఫ్ 2004 ఎల్‌ఈడీ సర్వీస్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సీతారామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ముంపులో పాడైన ఎల్‌ఈడీ టీవీలకు ఉచితంగా సర్వీసింగ్ చేస్తామని, ప్యానెల్, బాండింగ్ చార్జీల్లో 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలలోపు సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. మరింత సమాచారం కోసం 9246233335, 9246233337 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ హామీలు అమలు కావడం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితుల సహాయంపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వాంబేకాలనీ, రామానగర్, శాంతినగర్, న్యూరాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పర్యటించి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భోజన కేంద్రాల్లో బాధితులకు ఆహారం అందించారు. ప్రభుత్వం సరఫరా చేసిన సరుకులు పాడైపోయాయని బాధితులు ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎవరెవరికి, ఎంత ఆర్థిక సహాయం చేస్తుందో స్పష్టత లేదన్నారు. వరద వచ్చి 15 రోజులు గడిచినా, ఆర్థిక సాయం ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయని, విధులకు రాలేదని సస్పెండ్ చేస్తూ అధికారులు నోటీసులు ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమాలలో సీపీఎం నేతలు బోయి సత్యబాబు, బీ రమణరావు, కే దుర్గారావు, టీ ప్రవీణ్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్కే పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరుకు తగ్గిన వరద ఉధృతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో వరద ఉధృతి తగ్గింది. బుడమేరు ఉధృతికి దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డుపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వరద శాంతించడంతో రాకపోకలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో కొంతమంది సొంత ఖర్చుతో రోడ్డు వేసుకుంటున్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్‌లు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తికి సహస్రనామార్చన జరిగింది. స్వామివారికి నిర్వహించిన పంచామృత అభిషేకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గోవింద నామస్మరణ మధ్య వైభవంగా సేవ జరిగింది. అనంతరం స్వామి వారికి తులసీ దళాలతో అలంకరించిన పూజలు చేశారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

- నేటికీ తీరని వరద బాధితుల కష్టాలు
- ఇళ్లు శుభ్రం అయ్యే వరకు పనులకు వెళ్లలేని పరిస్థితి
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం



వైఎస్సార్ కాలనీలో స్వచ్ఛంద సంస్థ అందజేస్తున్న దుస్తుల కోసం ఎగబడుతున్న వరద బాధితులు



కండ్రికలో సామాన్లు శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు ప్రాంతాల్లోని 90 శాతం మంది రెక్కాడితేగాని డొక్కాడని బడుగు జీవులు. బుడమేరు వరదలో వారం రోజులు.. ఆ తర్వాత వరద మిగిల్చిన బురదలో వారం రోజులుగా ముంపు ప్రాంతాల వారంతా ఇబ్బందులు పడ్డారు. 15 రోజులుగా వరద బాధితులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. వరద తీసినా ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొంతమేర నీరు, బురద ఉండటంతో ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. 15 రోజులుగా జీవనోపాధి లేదు. విలువైన వస్తువులు, నిత్యావసర వస్తువులు పనికి రాకుండా పోయాయి. ప్రభుత్వం అందించిన సరుకులు వంటకు పనికి రావడం లేదు. దాతల నుంచి వస్తున్న సహాయం కొంత మేర మాత్రమే చేరుతోంది. ప్రభుత్వం సహాయం ఎప్పుడు అందిస్తుందా.. అని బుడమేరు ముంపు బాధితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

బుడమేరు వరద ముంపునకు గురైన అంబాపురం, వైఎస్సార్ కాలనీ, భవానీపురం, ఊర్మిళానగర్, న్యూ రాజరాజేశ్వరీపేట, పాత రాజరాజేశ్వరీపేట, వించిపేట, అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్, తోటవారి వీధి, వాంబే కాలనీ, పాయకాపురం, రాజీవ్‌నగర్, ఉడా కాలనీ, కండ్రిక ప్రాంతాలు నీటమునిగాయి. ఇప్పటికీ అంబాపురం పంచాయతీ ఏరియా, కండ్రిక కాలనీ, తోటవారి వీధి, జక్కంపూడి కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేటలోని కొన్ని ప్రాంతాలు వరద ముంపులోనే ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో పూర్తిగా వరద పోయినప్పటికీ బురద మురికి నీరు ఇళ్లలో చేరి ఉంది. ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో బాధితులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సహాయక చర్యలు నిలిపివేసింది. ఇళ్లలో బురద, లోతట్టు ప్రాంతాల్లోని వీధుల్లో పేరుకు పోయిన బురదను తొలగించేందుకు మరికొన్ని ఫైరింజన్, పారిశుద్ధ్య కార్మికులు సేవలు అందిస్తే దాని నుంచి బయటపడేవాళ్లమని స్థానికులు చెబుతున్నారు. 15 రోజులుగా పనులు లేవు, కనీసం ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లడం లేదు. ఇంటింటికీ రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. పూర్తిగా నీట మునిగిన ఇళ్లలో ఏ ఒక్క వస్తువు పనికి రాని పరిస్థితి. ఇప్పటికీ ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. ఇళ్లు బాగు చేసుకోవడానికే రూ.వేలల్లో ఖర్చువుతుందని, ఎప్పటి కోలుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు శుభ్రం చేసుకోవడంతోనే సరిపోతుందని, ఇక పనులకు వెళ్లేదెప్పుడు అంటూ నిలదీస్తున్నారు. దాతలు అందించే సాయంలోనూ రాజకీయాలు చేరాయని, పార్టీలు ముఖాలు చూసి సరుకులు అందిస్తున్నారని రాజీవ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. బుడమేరు వరద మిగిల్చిన భయం ముంపు ప్రాంత వాసులను ఇంకా వీడలేదు. కాలనీ వాసులను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి.

- కండ్రిక వాసులు వస్తువులన్నీ రోడ్లపై వేసి వాటి మధ్యనే జీవనం గడుపుతున్నారు. ఇళ్లన్నీ వాసన వస్తున్నాయని ఉబ్బసం, ఆయాసం, ఇస్నోఫిలియా వంటి వ్యాధులు ఉన్న పెద్ద వాళ్లు వాసనకు తల్లిడిల్లిపోతున్నారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.
- పైపుల రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ వరకు రోడ్లకు గండ్లుపెట్టి అంబాపురం వైపు నిలిచిపోయిన నీటిని బుడమేరుకు మళ్లిస్తున్నా.. ఇంకా ఖాళీ స్థలాల్లో నీరు పోవడం లేదు. ఇళ్ల మధ్య నీరు అలాగే నిలిచి ఉంది. గండ్లు కారణంగా ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయాయి.
- వైఎస్సార్‌కాలనీ పక్కన, పాముల కాలువ వద్ద నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది.
- వైఎస్సార్‌కాలనీ, జక్కంపూడి గ్రామాల మధ్య వెస్ట్ బైపాస్ నెర్రెలిచ్చింది.
- పాత రాజీవ్‌నగర్ కాలనీ వాసులు వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఈ నెల ఒకటో తేదీ వరదల్లో కొట్టుకుపోయిన రాజరాజేశ్వరి పేటకు చెందిన పోలినాయుడు అనే వ్యక్తి మృతదేహం ముళ్ల కంపల్లో చిక్కుకుని .. వరద పోవడంతో ఆదివారం ఉదయం బయటపడింది.

14,600 టూ వీలర్స్‌కు ఉచితంగా మరమ్మతులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ముంపులో మునిగిపోయి పాడైపోయిన టూ వీలర్స్‌కు నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మరమ్మతులు చేశారు. నగరంలోని ముంపు ప్రాంతాలైన సింగ్‌నగర్, భవానీపురం చర్చి సెంటర్, ఊర్మిళానగర్, సితార సెంటర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ తదితర ముఖ్య కూడళ్లల్లో మొత్తం 13 పాయింట్లను ఏర్పాటు చేసి ముంపులో పూర్తిగా దెబ్బతిని స్టార్ట్ అవ్వని ద్విచక్ర వాహనదారులకు ఉచిత సేవలు అందించటంపై టూ వీలర్స్ దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరద నీళ్లలో మునిగి బాగు చేయించుకునే స్తోమత లేని వారి కోసం ఈ ఉచిత మెగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ సుభాని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 380 మంది మెకానిక్‌లు విజయవాడ వచ్చారని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఒక్కో పాయింట్‌లో సుమారు 1100 మంది చొప్పున టూ వీలర్స్‌ను బాగుచేయించుకోగా మొత్తం మీద 14,600 వాహనాలకు ఉచితంగా మరమ్మతులు చేశామన్నారు. వరద బాధితులకు మా వంతు ఏదో ఒకటి చేయాలన్న ఉద్దేశంతో అసోసియేషన్‌లో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, అప్పలరాజు



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన చేయూత ఫౌండేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం వరద ముంపు ప్రాంతాల్లోని బాధితులకు రూ. 3 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కండ్రిక, వాంబే కాలనీ, శారద స్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఫౌండేషన్ సభ్యులతోపాటు స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు బాధితులకు నిత్యావసరాలు అందజేశారు. పాతపాడులో కార్నర్ స్టోన్ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అనంతలక్ష్మీదేవి సేవా సంస్థ రామకృష్ణాపురం ఫౌండర్ చైర్మన్ పెనుమత్స అప్పలరాజు, స్పందన చేయూత చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, సెక్రటరీ ఆనంద్, ట్రెజరర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. సుందరయ్య నగర్‌లోని వరద బాధిత మహిళలకు ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు మండలం, కాకరాయిపల్లి గ్రామం ఎలిమెంటరీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న చందా హేమలత, ఆమె భర్త రిటైర్డు ఉపాధ్యాయుడు రామచంద్రయ్య చీరలు పంపిణీ చేశారు. కడప జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి మేరువ వెంకట నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిత్రదీప్ ఫౌండేషన్ సహాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వరద బాధితులకు తమ ఫౌండషన్ ద్వారా అన్నదానం, నిత్యావసరాల కిట్‌ల పంపిణీ, దుస్తుల పంపిణీ వంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించి వారికి అండగా ఉన్నామని మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఏపీ స్టేట్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సొంగా సందీప్ చెప్పారు. మిత్రదీప్ ఫౌండేషన్ తరపున అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని వరద బాధితులకు నిత్యావసరాల కిట్‌ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ గత 10 రోజులుగా తమ ఫౌండేషన్ ద్వారా వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కాలనీ వాసులకు నిత్యావసరాల కిట్‌తో పాటు వాంబే కాలనీలో 10 రోజులుగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు మూర్తి, వంశీ, ఆసీఫ్, ఎం .సురేష్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు సాయం అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలో ఇటీవల వరద సృష్టించిన బీభత్సం కారణంగా సర్వం కోల్పోయి రోడ్డునపడ్డ క్రమంలో వారికి చేయూతనిచ్చేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పలు స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థలు ముందుకు వచ్చాయి. ఆదివారం వారు ముంపు ప్రాంతమైన కండ్రికలోని బాధితులకు దాతల సహకారంతో బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి విపత్కర సమయంలో సామాజిక బాధ్యతగా బాధితులకు ఎంతో కొంత సాయం చేస్తూ సేవా దృక్పథంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి వచ్చిన సామాజిక సేవా సంస్థల్లో ఫ్రెండ్స్ ఫౌండేషన్, జనమైత్రి, మేథ, మదర్ థెరిసా, మాతృదేవోభవ.. పితృదేవోభవ, వసంత హెల్పింగ్ హ్యాండ్స్, ఎస్ఎస్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్, 301 ఫౌండేషన్, ప్రాణదాతలు ఉన్నాయి.

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, రూ. 50వేలు నగదును ఆదివారం అందజేశారు. వాకర్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ డెప్యూటీ, గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, చిన్నం శ్రీదేవీలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ మాట్లాడుతూ వరద ముంపుతో సర్వం కోల్పోయిన వృద్ధాశ్రమానికి తమవంతు సాయంగా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ రీజియన్ కార్యదర్శి కొండాయగుంట రాము, వీరంకి గోకర్ణేశ్వరరావు, సీతారామారావు, పి.రంగనాథ్, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ గ్రూప్ ఆధ్వర్యంలో..



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతంలో వరద బాధితులకు ఎన్‌ఆర్‌ఐ ఆత్మీయ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్నారై గ్రూప్ సభ్యులు రమేష్ రామిశెట్టి, విజయ రామిశెట్టి, వంశీ, రాకేష్, ఓం నక్క, సత్య వెజ్, నాని, గణేష్, దీపిక లక్ష్మణ్, భాస్కర్, స్వాతి, సుగుణ, ప్రశాంత తదితరులు పాల్గొన్నారు. మార్పు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తులసి పద్మశ్రీ ఆధ్వర్యాన స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని మహంకాళి టెంపుల్ దగ్గర బాధితులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఇందిరానాయక్‌నగర్‌లో రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం, వంట సామాన్లను ఆదివారం పంపిణీ చేశారు.

వరద నీరు పోయే దారేదీ.!

- చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికుల ఆందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం



దావు బుచ్చయ్యకాలనీలోని సాయినగర్ కాలనీలో నిలిచిన నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ వాసులకు ఇంకా వరద కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ కనీసం మురుగు బయటకు పోయేందుకు అవసరమైన మురుగుకాలువలు కూడా లేవు. ఇటీవల బుడమేరు వరదలకు మెయిన్ రోడ్డుపై నుంచి నీరు నివాస ప్రాంతాలకు చేరుకుంది. దీంతో ఆ నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో నివాసాల మధ్య ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. వరద నీరు బయటకు పోయేందుకు అవసరమైన కనీస చర్యలు కూడా అధికారులు చేపట్టడం లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించుకున్న నివాసాలు వరద నీటికి దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 32వ డివిజన్‌లో సుమారు 30 మోటార్లు ఏర్పాటు చేసి వరద నీటిని తోడిన అధికారులు కనీసం ఇక్కడ ఒక్కటంటే ఒక్క మోటారు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. అలాగే వరద నీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరితే మీకు వచ్చిన వరద తక్కువేనని తక్కిన ప్రాంతాల్లో వరద తీవ్రత అధికంగా ఉందని చెబుతూ కనీసం ఇక్కడకు వచ్చిన చూసిన వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారాయణ వరద నీటిని మోటార్‌లతో తోడుతామని చెప్పడమే తప్ప తమ ప్రాంతంలో అధికారులు కనీస చర్యల తీసుకోవడం లేదని వాపోతున్నారు. వరద నీరు ఖాళీ స్థలాల్లో నిలిచిపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో నిలిచిన వరద నీటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జలదిగ్బంధంలో జర్నలిస్టుల కాలనీ

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక కాలనీని ఆనుకొని ఉన్న జర్నలిస్టుల కాలనీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. నగరానికి శివారు, పల్లపు ప్రాంతం కావడంతో కాలనీలో ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. జర్నలిస్టుల కాలనీవాసులు, సమీపంలోని కుటుంబాల వారు వరద నీటిని తొలగించాలని కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేయగా మోటార్లు ఏర్పాటు చేసి నీరుతోడుతున్నా పల్లంగా ఉన్న ప్రాంతం నుంచి వరద నీరు నిలకడగా ఉంటోంది. కాలనీలో రోడ్లు గోతులు పడి నడవడానికి వీలులేక అవస్థలు పడుతున్నారు. ఇళ్లకి విద్యుత్ సదుపాయం కల్పించినా వీధి దీపాలకు విద్యుత్ లేకపోవడంతో చీకటి పడితే బయటకు రావడానికి స్థానికులు భయపడుతున్నారు. చుట్టూ నీరు ఉండటంతో పాములు, జలగల భయంతో ఉంటున్నారు. నిల్వ ఉన్న నీటిని త్వరగా బయటకు పంపాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

జై జై గణేశా.. బై బై గణేశా



గణనాథుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వినాయక నిమజ్జనోత్సవానికి తరలి వెళ్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయకుని ఆశీస్సులతో సకల విఘ్నాలు తొలగి ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మధురానగర్ పప్పులమిల్లు సెంటర్‌లో ఆదివారం వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఏటా చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. స్వామివారి శేషవస్త్రంతో మల్లాది విష్ణును నిర్వాహకులు సత్కరించారు. అలాగే 30వ డివిజన్ వినాయకనగర్, 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో ఆదివారం చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. డప్పువాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలు, డీజేల నడుమ గణనాథుడి ఊరేగింపు జరిగింది. మధురానగర్ కొబ్బరితోటలో తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడికి ఆదివారం మహిళలు వీడ్కోలు పలికారు. మొత్తం మహిళలలే నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని ముందుకు నడిపించారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి హారతి కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. నిమజ్జనంలో వ్యాపారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వినాయక లడ్డూ దక్కించుకున్న ముస్లిం



లడ్డూ ప్రసాదాన్ని స్వీకరిస్తున్న అన్వర్, హరనాథ్ స్వామి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం చెరువు సెంటర్‌లో శ్రీవిఘ్నేశ్వర యువ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 15 కేజీల స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ముస్లిం దక్కించుకున్నాడు. స్థానికుడు, న్యాయవాది షేక్ అన్వర్ రూ.71 వేలకు వేలంలో పాడుకుని తన స్వామి భక్తిని చాటుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొనటం ఆనవాయితీగా వస్తుంది. అయితే స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఒక ముస్లిం వ్యక్తి పాడుకోవటం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని పలువురు భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ వెణుతురుమిల్లి హరనాథ్ స్వామి, నిర్వాహకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్యపరీక్షలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత శ్రీకాంత్ కుమార్ జైన్ సహకారంతో వృద్ధులకు ఉచిత వైద్యపరీక్షలు, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ గీతా శ్రీనివాస్ మాట్లాడుతూ వయోవృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడంతోపాటు నిత్యావసరాలు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మారుతీ గ్యాస్ ఏజన్సీ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, ట్రస్టీలు అమరా ఉమామహేశ్వరరావు, ఎస్‌వీయూ సతీష్‌కుమార్, తట్టి అర్జునరావు, కె మధుసూదనరావు, ఎస్ఎన్ వరప్రసాద్, పీ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్‌లో ఇల్లు శుభ్రం చేసుకుంటున్న గృహిణి



ఊర్మిళానగర్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న కాలనీ వాసులు

వరద కష్టాలు తీరేదెప్పుడు ?

నగరంలో బుడమేరు వరద సంభవించి 15 రోజులు గడిచినా వరద బాధితుల కష్టాలు ఇప్పట్లో తీరేలా కనపడటం లేదు. బురదను శుభ్రం చేసుకోవడం తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న చర్యలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే సాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వైఎస్సార్ కాలనీలో బట్టల దుకాణంలో తడిసిన దుస్తులు తీస్తున్న చిరు వ్యాపారి